## క్లుప్తంగా

### ఓటరు జాబితాపై అవగాహన

పెనగలూరు (ఓబులవారిపల్లి) : తుది ఓటరు జాబితాపై రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ మురళీకృష్ణ అవగాహన కల్పించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాలలోని ఓటర్ల జాబితాను పరిశీలించి వారికి కావాల్సిన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికలలో ఓటర్ల జాబితాను ఎలా ఉపయోగించాలనే అంశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయానికి వెండి దీపాలు వితరణ


వెండి దీపాలు అందజేస్తున్న కన్నడ భక్తులు

రాయచోటి టౌన్ : భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయానికి కర్నాటక రాష్ట్రానికి చెందిన భక్తులు హెచ్ఆర్ వసంతకుమార్, ఉమలు వెండి దీపాలను బహూకరించారు. వీటిని ఆలయ ఈఓ డివి రమణారెడ్డికి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు దాతల పేరున స్వామి వారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### నివాళి


రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లి : మంగంపేట అయ్యపురెడ్డిపల్లెలో ఉప సర్పంచ్ కొలూరు మధుసూదన్‌రెడ్డి తండ్రి కొలూరి రామచంద్రారెడ్డికి బుధవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఘనంగా నివాళి అర్పించారు. రామచంద్రారెడ్డి పెద్దకర్మలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు నాయకులతో కలిసి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమన్‌వర్మ, రవిరెడ్డి, ఎంపీటీసీ బండారు మల్లి తదితరులు పాల్గొన్నారు.

### ఓపీఎస్‌పై వైఖరి తెలపాలి

రాయచోటి అర్బన్ : పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలుపై రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకుల తమ వైఖరిని వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని డీఈఓ కార్యాలయం వద్ద అన్ని పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు పోస్టు కార్డులను పంపడం ద్వారా తమ డిమాండ్‌ను తెలిపారు. తమ డిమాండ్‌లను పరిష్కరించే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు శివారెడ్డి, చంద్రశేఖర్, అక్రంబాషా, శ్రీధర్‌రెడ్డి, దావూద్, రాజారమేష్, హఫీజుల్లాతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

### వలంటీర్లకు అవార్డులు

ఓబులవారిపల్లి : మండలంలోని చిన్నంపల్లి సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఏనుగుల రెడ్డయ్యకు సేవా వజ్ర అవార్డు, గూడూరు సురేష్‌లకు సేవా రత్న అవార్డులను బుధవారం ప్రకటించడం జరిగింది. బుధవారం ఈ మేరకు ప్రభుత్వం వలంటీర్ల జాబితాను విడుదల చేసింది. ప్రతి యేడాది విశేష సేవలు అందుకున్న వలంటీర్లను గుర్తించి వారికి ప్రోత్సాహక నగదును అందిస్తుంది. ఈ సందర్భంగా వలంటీర్ల సేవలను ఎంపీడీఓ ప్రశంసించారు. అలానే తోటి వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని అభినందించారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో మల్లెమ్మ అమ్మవారు

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని ఓదివీడు గ్రామం కస్పా సమీపంలో నూతనంగా నిర్మించిన మల్లెమ్మ ఆలయంలో మల్లెమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. బుధవారం అమ్మవారిని వేదపండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అమ్మవారిని ప్రతిష్టింపజేశారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టను గ్రామ ప్రజలు, పెద్దల సహకారంతో నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### ఈకేవైసీ పూర్తి చేయాలి

కలికిరి: ఈ–పంట నమోదు చేసుకున్న రైతులకు వెంటనే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రనాయక్ అన్నారు. గుట్టపాళెం రైతు భరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. స్థానిక రైతులతో ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకానికి నేడు తుది గడువు ఉన్నా గుట్టపాళెం గ్రామ పరిధిలోనే 57 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోకపోవడంపై ఆర్‌బీకే సిబ్బందిని విచారించారు. ఏడీఏ వాణిశ్రీ, ఏఓ మమతారెడ్డి, వీఏఏ రాజేష్ పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా 'గుట్టపల్లె'


సంబేపల్లె: పద్మావతమ్మ రహదారి ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, నాయకులు


రాయచోటి అర్బన్: భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

**ఆలయం వరకు నిర్మించిన రహదారిని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి**

సంబేపల్లె : గుట్టపల్లె వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం సంబేపల్లె మండలం గుట్టపల్లెలో రూ. 1.19 కోట్ల ఏబిబిడీ నిధులతో గుట్టపల్లె రామకృష్ణారెడ్డి నగర్ నుంచి శ్రీ వీరాంజనేయ దేవస్థానం వరకు నిర్మించిన పద్మావతమ్మ రహదారి ప్రారంభంలో ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, చిదంబర్ రెడ్డి, క్రియేటీవిటీ అండ్ కల్చరల్ కమిషన్ బోర్డు మెంబర్ నిర్మల, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డిలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు చిదంబర్ రెడ్డి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో మహిమ గల గుట్టపల్లె వీరాంజనేయస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండడం హర్షనీయమన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణరెడ్డి, వైస్ ఎంపీపీ పాత్తూరి రవీంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ నాయుడు, వాసుదేవ రెడ్డి, సుధాకర్ నాయుడు, ఉప సర్పంచ్ లక్ష్మీదేవి, రవీంద్ర నాయుడు, రాళ్లపల్లె రవీంద్ర, నరసింహారెడ్డి, ఎంఎస్ నాయుడు, ఆంజనేయులు, నారా శ్రీనివాసులు నాయుడు, నారా సిద్దయ్య నాయుడు, కోట ఆంజనేయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**మానవత్వంలో దైవత్వాన్ని చూపించింది కృష్ణావతారం**

రాయచోటి అర్బన్ : మానవత్వంలో దైవత్వాన్ని చూపించింది కృష్ణావతారమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వరిగ రహదారి మార్గంలో శ్రీదేవకీదేవి యశోద కృష్ణాలయ భూమిపూజలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా శ్రీకృష్ణుడి తత్వం మానవ జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేస్తోందన్నారు. కష్టాలను, భయాలను, విఘ్నాలను తొలగించి విజయపథంలో శ్రీకృష్ణనామం నడిపిస్తుందన్నారు. శాంతి, పురోగతితో ప్రజలు వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ట్రస్టు వ్యవస్థాపకులు పదిలం మహేష్‌కుమార్ యాదవ్, భక్తులు, దాతలు సమష్టిగా ఆలయాన్ని నిర్మింప తలపెట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాయచోటి 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి, స్టేట్ సివిల్‌సప్లయ్స్ డైరెక్టర్ పోలుసుబ్బారెడ్డి, ఆనందయ్య కరోనా మందు సృష్టికర్త నెల్లూరు ఆనందయ్య, జెడ్పీటీసీ వెంకటరమణ, చెన్నూరు ఎంపీపీ పీర్ల సురేష్, రామాపురం వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి నేతలు నరసింహారెడ్డి, జానం రవీంద్ర యాదవ్, సూరం వెంకటసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్**


మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేంద్రనాథ్

రాయచోటి అర్బన్ : రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ పల్లపు రాజమ్మ, ఎంపీడీఓ పి.సురేంద్రనాథ్, అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ పల్లపు రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చే సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలంటూ తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి దివాకర్‌బాబు మాట్లాడుతూ అర్హులైన రైతులు పీఎంకేవై పథకం ఈకేవైసీ చేయించుకుంటే వారి అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయంటూ చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రదీప్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 90 పనులను డ్వాక్రా మహిళలతో చేయించున్నట్లు తెలిపారు. ఇందుకు వైఎస్ఆర్‌సీపీ నేత తిరుపాల నాయుడు స్పందిస్తూ కాంట్రాక్టు చేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లించడం లేదంటూ ఆరోపించారు. పశుసంవర్ధకశాఖ తరపున ఆర్‌బీకేల ద్వారా గడ్డి విత్తనాలను అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పశువుల బీమా కింద రూ. 400లు చెల్లిస్తే 3 సంవత్సరాలపాటు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉపాధి పథకం ఏపీఓ రమేష్ మాట్లాడుతూ ఈ పథకాన్ని ఎంత బాగా ఉపయోగించుకుంటే అంతమేర గ్రామీణాభివృద్ధి జరుగుతుందన్నారు. కరువు మండలాల్లో రైతులు తమ పొలాల్లో ఫారం పాండ్స్, కుంటలు నిర్మించుకుని నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏపీఐఐసీ సభ్యుడు రాయవరం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పలు జగనన్న కాలనీలలో బోర్లువేసి, మోటార్లు బిగించినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదన్నారు. అలాగే కాలనీలలో వీధిలైట్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి అంధకారం లేకుండా చూడాలంటూ ట్రాన్స్‌కో అధికారులను కోరారు. హౌసింగ్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పక్కాగృహాల లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తికి మిగిలిన శాఖ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు తమ వంతు సహాయ, సహకారాలు అందించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామచంద్రా రెడ్డి, వైఎస్ఆర్‌సిపి నేతలు శంకరరెడ్డి, దివాన్ సాహెబ్, ఏఓ కలీముల్లా బేగం, సీనియర్ అసిస్టెంట్ జుబేర్ అలీఖాన్‌తోపాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఆర్థిక బకాయిలు చెల్లించాలి

పెనగలూరు (ఓబులవారిపల్లి) : ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని జేఏసీ నాయకులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెనగలూరు మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు హరిప్రసాద్, మురళీ, సుబ్బరాయుడు, అనీల్ కుమార్, వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, ఆనందవేణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### 'దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేసుకుందాం'

రాజంపేట రూరల్ : కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో 16వ తేదీ నిర్వహించే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేసుకుందామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్ రాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్‌లు కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద బుధవారం భారత్ బంద్ – పారిశ్రామిక సమ్మె గోడ పత్రాలను వీరు ఆవిష్కరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విధానాలు దేశ ప్రజానికానికి అత్యంత ప్రమాదకరమని వారు తెలియజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి బి.నరసింహులు, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నేత ఎన్.నాగేశ్వరరావు, హమాలీ నాయకులు గిరీష్, రాఘవేంద్ర, సుంకయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

### కాలనీ ప్రారంభం

పెనగలూరు (ఓబులవారిపల్లి) : మండల కేంద్రమైన పెనగలూరులో చిన్నవెంగల్ రెడ్డి నగర్‌ను బుధవారం సెక్రటరీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. నందలూరు మండలం చాపలవారిపల్లె గ్రామానికి చెందిన కొంతమంది పెనగలూరు పంచాయతీలోని సిద్దవరం రోడ్డులో పక్కా గృహాలు నిర్మించుకున్నారు. ఈ పక్కా గృహాలకు చాపలవారిపల్లి గ్రామంలో కొంతమంది చిన్న వెంగల్ రెడ్డి నగర్‌గా బోర్డు వేశారు. ఈ కొత్తకాలనీకి నామకరణం చేసి పెనగలూరు ఉప సర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డి మాట్లాడారు. తన పేరును ఏర్పాటు చేసిన ఈ కాలనీలో రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కరిముల్లా, సెక్రటరీ సతీష్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవడమే లక్ష్యం


ఆశ్రమానికి టేబుళ్లు అందజేస్తున్న సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవడమే లక్ష్యమని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయికిషోర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కొర్లకుంట ఆయన స్వగృహంలో ఉదయం నుంచి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సుబ్రమణ్యం రెడ్డి ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షులు టి.కృష్ణరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, వైకోట సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎస్.సుబ్బరత్నమ్మ, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్.రఫీ శాలువా, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాయికిషోర్‌రెడ్డి కొర్లకుంట ఉప సర్పంచ్ ముక్కా రూపేష్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలో పాల్గొన్నారు. పాపిరెడ్డిపల్లె జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో వారు ఉచితంగా టేబుళ్లను అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, పోలి పాపిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు అనాథలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ ఆళ్ల ఈశ్వరయ్య, ఎంపీటీసీలు మహేష్‌కుమార్‌రెడ్డి, వత్తలూరు కుమార్ రెడ్డి, రమేష్‌రాజు, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం కొర్లకుంట గ్రామస్తులు పెద్దఎత్తున పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

### అయ్యప్పస్వామికి అభిషేకాలు


పూజలందుకున్న అయ్యప్ప స్వామి

రాజంపేట రూరల్ : హరిహర సుతుడు అయ్యప్ప స్వామికి అభిషేకాలు, పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ శివార్లలోని మణికంఠనగర్‌లో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపెంట పాలప్రకాష్, రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన గురుస్వామి కొండా సత్యనారాయణ శాస్త్రోత్తకంగా జరిపించారు.

# బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు


కుమారస్వామి, లక్కిరెడ్డిపల్లి మండలం


కేవీ శ్రీనివాసులు, వీరబల్లె


జ్ఞానేశ్వరి, చిట్వేలి మండలం

లక్కిరెడ్డిపల్లె : మండల తహసీల్దార్‌గా కుమారస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్‌ల బదిలీలు చేసిన సంగతి విధితమే. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లెలో పనిచేస్తున్న ఉదయ్ శంకర్ రాజు అనంతపురం జిల్లా పెనుకొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లాకు చెందిన కుమారస్వామి లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ రెడ్డన్న, ఆర్ఐ సమ్మత్ ఖాన్, సర్వేయర్ కరీముల్లా, వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**చిట్వేలి తహసీల్దార్‌గా జ్ఞానేశ్వరి**

చిట్వేలి : చిట్వేలి తహసీల్దార్‌గా జ్ఞానేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుమని జ్ఞానేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. రాజంపేట ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆమె బదిలీపై చిట్వేలికి వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**వీరబల్లె తహసీల్దార్‌గా కేవీ శ్రీనివాసులు**

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె తహసీల్దార్‌గా కేవీ శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా బాధ్యతలు చేపడుతూ బదిలీపై వీరబల్లెకు వచ్చారు. ఎన్నికల విధులలో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిట్వేలి : మండలంలోని మైలపల్లి, దేవమాచుపల్లి, చిట్వేలి, తిమ్మయ్యగారిపల్లి పోలింగ్ కేంద్రాలను బుధవారం కలిసి తహసీల్దార్ జ్ఞానేశ్వరి పరిశీలించారు. అలాగే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలలో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. దొంగఓట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుమనీ, ఆర్ఐలు, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

### ఏపీఎన్జీఓ ఆధ్వర్యంలో నిరసన

రాయచోటి అర్బన్ : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఏపీఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, రాయచోటి అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలు డిమాండ్ చేశారు. బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహసీల్దార్, డీఎంహెచ్ఓ కార్యాలయం అధికారులకు వినతిపత్రాలను అందచేశారు.

# ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులు

**జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి**


రాజంపేట టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను పంపిణీ చేస్తున్న ఆకేపాటి, పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆకేపాటి పాల్గొని మాట్లాడారు. మనిషికి డబ్బు, ఆస్తులకంటే ఆరోగ్యం ఎంతో విలువైనదని, అందువల్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలంతా ఆరోగ్యవంతులుగా ఉండటం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం గతంలో ఏ సీఎం కూడా ఖర్చు చేయని విధంగా జగన్ ఖర్చు పెడుతున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు ఆకేపాటి, పోలా చేతుల మీదుగా జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మర్రి రవి, కమిషనర్ రాంబాబు, కౌన్సిలర్లు న్యామత్, సూరి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం**

రాజంపేట : ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆకేపాటి భవన్‌లో పోలి, అప్పారాజుపేట, అత్తిరాల గ్రామస్తులు ఆకేపాటిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి ఇళ్ల ముంగిటకే ప్రభుత్వం అన్ని సేవా కార్యక్రమాలు తీసుకువచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, పోలి మురళీ రెడ్డి, కృష్ణారావు యాదవ్, వడ్డే రమణ, పృథ్వీపరెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కాగా ప్రజలు విన్నవించిన సమస్యలను ఆకేపాటి సానుకూలంగా విని స్పందించారు. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని ఆకేపాటి భరోసా ఇచ్చారు.

# పాఠశాల పనులు త్వరితగతిన పూర్తి చేయండి


పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ఓబులవారిపల్లె : తల్లెంవారిపల్లె ఉన్నత పాఠశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాజంపేట ఆర్డీఓ మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం తల్లెంవారిపల్లె గ్రామంలో నిర్మిస్తున్న నూతన జెడ్పీహెచ్ఎస్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో కలియతిరిగి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు గురించి అధికారులను, పాఠశాల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆర్‌బీకే సచివాలయ భవనాన్ని ఆయన తనిఖీ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోపు పాఠశాల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పీర్ మున్నీ, ప్రధానోపాధ్యాయుడు ఛాయదుల్లా, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, వైఎస్సార్ పార్టీ నాయకులు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలు పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాలి


పరిసరాల పరిశుభ్రతపై సూచనలిస్తున్న కమిషనర్

రాయచోటి అర్బన్ : పట్టణంలోని పలు విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఆయన మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, సచివాలయం పర్యావరణ కార్యదర్శులతో కలసి పట్టణంలోని పలు విద్యాసంస్థల పరిసరాలను, తరగతి గదులను, మరుగుదొడ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చంటూ సూచించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహనా కార్యక్రమాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలంటూ తెలియజేశారు.

# ఎస్టీ కాలనీ సమస్యలు పరిష్కరించండి

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రామస్వామిపల్లి ఎస్టీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు తహసీల్దారు మురాషా వలికి విన్నవించారు. ఇటీవల రామస్వామిపల్లె ఎస్టీ కాలనీ వాసులు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఆధార్, రేషన్ కార్డులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు బుధవారం ఎస్టీ కాలనీని సందర్శించారు. గ్రామస్తులు తమ పిల్లలకు వివాహాలయ్యాయని, ఇళ్ల స్థలాలు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. అంతేగాకుండా తమ గ్రామం అటవీ ప్రాంతంలో ఉండటంతో విద్యుత్ సదుపాయం లేదన్నారు. ఫోన్‌లు సరిగా పనిచేయలేదని, నెట్‌వర్క్ సదుపాయం కూడా లేదని తమకు సౌకర్యాలు కల్పించాలని కాలనీ వాసులు విన్నవించుకున్నారు. పక్కా గృహాలు మంజూరు చేసేందుకు ముందుగా చర్యలు తీసుకుంటామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ అనూరాధ, వీఆర్‌ఓ నాని తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో వసంత పంచమి వేడుకలు


సంబేపల్లె: సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె : మాఘ శుద్ధపంచమి చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని వసంత పంచమి వేడుకలను బుధవారం సంబేపల్లె ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నాగేశ్వర నాయక్, జయమ్మలు అమ్మవారి చిత్రపటానికి పూజలు జరిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సకల విద్యా స్వరూపిణీ, సకల వాఙ్మయానికి మూల కారకురాలు, భాష, లిపి, కళలను ఆది దేవత సరస్వతీ అని పేర్కొన్నారు. వేదాలకు జనయిత్రీ, వీణ పుస్తకదారినైన ఆ తల్లి దయ ఉంటే మూర్ఖుడు కూడా మహా విద్వాంసుడు అవుతారని, ఉన్నత విద్యా ప్రాప్తికి, ఉన్నత ఉద్యోగ పదోన్నతికి సరస్వతిని ఆరాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో అక్షరభ్యాసం నిర్వహించారు.

ఓబులవారిపల్లె : మండలంలోని రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో బుధవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కరస్పాండెంట్ యువరాజ మాట్లాడుతూ నాగశుద్ధ పంచమి నాడు అమ్మవారు జన్మించిన రోజు అని తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి


నిరసనలో పాల్గొన్న పెన్షనర్లు, ఉద్యోగులు

లక్కిరెడ్డిపల్లె : ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లక్కిరెడ్డిపల్లె తాలుకా ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు బలరామరాజు పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పెన్షనర్లు, ఉద్యోగస్తుల పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌లు పరిష్కరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లుకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్జీఓ ఉపాధ్యక్షుడు దేవదానం, పెన్షనర్ల సంఘం తాలుకా అధ్యక్షుడు వెంకటరమణ, ఎన్జీఓ నాయకులు సాహెబ్, రహీం, వెంకటేష్, డీటీ రెడ్డన్న, విఆర్‌ఓలు ఉద్యోగ సంఘాలు పాల్గొన్నారు.

# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సిద్దవటం : ఉప్పరపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు గ్రామ సచివాలయ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాలను పడవేస్తే అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. హరిత రాయబారులు మీ ఇండ్ల వద్దకు తోపుడు రిక్షాలను తీసుకొస్తారని చెత్తను రిక్షాలోనే పడేయాలన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మోదీన్‌సాబ్‌పల్లి, ముమ్మడిగుంటపల్లి గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలియజేశారు.